వాడీవేడిగా ప్రజావేదిక



ప్రజా వేదికలో విచారణ చేస్తున్న ఏపీడీ రోజారమణి



అధికారులను నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం
- దుర్వినియోగమైన నిధుల రికవరీ–ఏపీడీ

కోటవురట్ల : సమస్యలు పరిష్కారం కానప్పుడు ఈ ప్రజా వేదికలెందుకు? ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలను ప్రజా ప్రతినిధులు నిలదీయాలి? అందుకు అధికారులు వివరణ ఇవ్వాలి? అలా కాకుండా ప్రజా ప్రతినిధులను కూర్చోబెట్టి అధికారులు, సిబ్బంది లెక్కలు తేల్చుకుంటే ఎలా? అంటూ జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి ధ్వజమెత్తారు.

మండల పరిషత్ కార్యాలయం వద్ద 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను జాతీయ ఉపాధి హామీ పథకం 15వ సామాజిక తనిఖీ ప్రజా వేదికను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 24 పంచాయతీల్లో చేపట్టిన పనులు, మెటీరియల్, నిధుల వినియోగంపై ఏపీడీ రోజారమణి విచారణ చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ వివరణ ఇస్తూ.. మండలంలో ఈజీఎస్, పీఆర్, పశు సంవర్ధక శాఖ, అటవీ శాఖ, ఎస్ఎస్ఏ, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 1,026 పనులు నిర్వహించినట్టు తెలిపారు. మెటీరియల్ రూపంలో రూ.5.04 కోట్లు, వేతనాలు రూ.11.12 కోట్లు వెచ్చించినట్టు వెల్లడించారు. సామాజిక తనిఖీ అధికారులు 4 బృందాలుగా ఏర్పడి, వారం రోజుల పాటు నిర్వహించిన తనిఖీల్లో గుర్తించిన అంశాలపై ప్రజా వేదికలో విచారణ జరిపారు. ప్రజా వేదికలో గుర్తించిన అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేస్తామన్నారు.

అనంతరం ఉమాదేవి మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడేలా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు పుట్రేవు వెంకట సూర్యారావు మాట్లాడుతూ రహదారుల వెంబడి మొక్కల పెంపకాన్ని రైతులకు అప్పగించాలన్నారు. మరో ఎంపీటీసీ పెట్ల రాంబాబు మాట్లాడుతూ బి.కె.పల్లిలో ఉపాధి హామీ పథకం ద్వారా 11 మంది రైతులు గడ్డి పెంపకం యూనిట్లు నిర్వహించారని, వారికి రావాల్సిన నిధులు ఇంకా జమ కాలేదన్నారు. సర్పంచ్ పైల శివరామ్ మాట్లాడుతూ సెరీ కల్చర్ ద్వారా పట్టుపురుగుల పెంపకం యూనిట్‌ను ఓ రైతు ఏర్పాటు చేశారని, దానికి కూడా నిధులు మంజూరు కాలేదన్నారు. రైతులు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దారు జానకమ్మ, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఈవోపీఆర్డీ ప్రేమ్ సాగర్, ఏపీవో గంగునాయుడు, సామాజిక తనిఖీ అధికారులు, వీఆర్వోలు, ఉపాధి సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీని సందర్శించిన ఎంపీడీవో



మూలపేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. మూలపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పిల్లల హాజరు రికార్డును పరిశీలించారు. మెనూ ప్రకారం పోషకాహార పంపిణీపై ఆరా తీశారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు ఉన్నారు.

నాణ్యమైన హెల్మెట్లతో రక్షణ

మునగపాక: ప్రతి ఒక్కరూ నాణ్యమైన హెల్మెట్లు వినియోగించాలని ఎస్ఐ మహమ్మద్ అలీ కోరారు. శుక్రవారం ఆయన మునగపాక మెయిన్‌రోడ్డుపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపినా, పరిమితికి మించి లోడ్‌తో వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలన్నారు.

పారిశుధ్య ప్రచారానికి మైక్ వితరణ



నారాయడుపాలెం పారిశుధ్య కార్మికులకు మైక్ అందిస్తున్న సర్పంచ్ వెంకటి

మునగపాక : ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని నారాయడుపాలెం సర్పంచ్ కారుకొండ వెంకటి కోరారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పారిశుధ్యంపై ప్రచారం చేసేందుకు వీలుగా శుక్రవారం ఆమె పారిశుధ్య కార్మికులకు మైక్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



నాగులాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ దేవి

మునగపాక : చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని వైస్ ఎంపీపీ చిందాడ దేవి తెలిపారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాగులాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

శాస్త్రీయ సాగుతో మేలైన దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తులసిలక్ష్మి

రాంబిల్లి : సాగు విధానంలో రైతులు శాస్త్రీయ సలహాలు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించడం సాధ్యమని కొక్కిరాపల్లి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ తులసిలక్ష్మి అన్నారు. దిమిలి గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీ వరి సాగు విధానం, తెగుళ్ల–నివారణ చర్యలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించవద్దని ఏవోలు సుమంత, విజేత సూచించారు. సాగులో యంత్ర వినియోగంపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ మేఘన పలువురు రైతులు పాల్గొన్నారు.

వన్ టైం సెటిల్‌మెంట్‌కు తీర్మానం



కొక్కిరాపల్లి పీఏసీఎస్ మహాజన సభలో మాట్లాడుతున్న అధ్యక్షుడు మళ్ల కొండబాబు

యలమంచిలి : కొక్కిరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యులు, రైతులు తమ రుణాలు, వడ్డీ రాయితీపై వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) కోరుతూ తీర్మానించారు. సంఘ అధ్యక్షుడు మళ్ల కొండబాబు ఆధ్వర్యంలో స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మళ్ల కొండబాబు మాట్లాడుతూ సంఘంలో రుణాలు తీసుకున్న రైతు మరణిస్తే బీమా ద్వారా అప్పులు పూర్తిగా జమ చేసుకునేలా సభ్య రైతులు కోరగా, దీనిపై క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకునేలా తీర్మానించారు. సంఘ జమా ఖర్చులపై సభ్యులు ఆమోదం తెలిపారు. సంఘ ఆర్థిక పరిస్థితిపై చర్చించారు. రుణాలు సకాలంలో చెల్లించేలా రైతులు కృషి చేసి, సంస్థ అభివృద్ధికి సహకరించాల్సిందిగా అధ్యక్షుడు కొండబాబు కోరారు. రైతులు తమ వంతుగా రుణాలు త్వరితగతిన చెల్లిస్తే సంఘం నష్టాల నుంచి లాభాల బాట పడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, మాజీ జెడ్పీటీసీ బొద్దపు యర్రయ్యదొర, సంఘ మాజీ సభ్యుడు దాసరి కుమార్, సంఘ డైరెక్టర్లు పందిరి రాంబాబు, యర్రంశెట్టి చిన్నబ్బాయి, మున్సిపల్ కౌన్సిలర్లు తుంపాల శ్రీనువాసరావు, గొర్లె వెంకటేశ్వరావు, కోఆప్షన్ సభ్యులు షేక్‌బేబి, ప్రగడ రమణ, సంఘ సీఈవో పిళ్లా మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను వసూళ్లపై దృష్టి



పన్ను చెల్లింపుదారులకు రసీదును అందిస్తున్న ఈవోఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట : మండలంలోని ప్రతి గ్రామంలోనూ గ్రామ కార్యదర్శులు ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని ఈవోఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్ ఆదేశించారు. ప్రతి పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం, వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా కార్యదర్శులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం నామవరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలో ఇంటి పన్నులు చెల్లించిన వారికి రసీదులు అందించారు.

గ్రామాల్లో ఆరోగ్య సంరక్షణకు చర్యలు



వైద్యాధికారి రాజేశ్వరి

ఎస్.రాయవరం: వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రాజేశ్వరి తెలిపారు. పెనుగొల్లు పీహెచ్‌సీలో శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో వేసవి ఎండలు ముదురుతున్నాయని, పనుల నిమిత్తం వెళ్లాల్సి వచ్చినవారు తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి అవసరమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. రేవుపోలవరంలో కొందరు కిడ్నీ, క్యాన్సర్ రోగాలతో బాధపడుతున్న విషయం తమ దృష్టిలో ఉందన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు వైద్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. అయితే కిడ్నీ, క్యాన్సర్ రోగులు ఇప్పటికే అవసరమయిన చికిత్స తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కొత్తగా వ్యాధి లక్షణాలు ఉన్న వారు పీహెచ్‌సీలో సంప్రదిస్తే సత్వర వైద్యం అందిస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇళ్ల వద్దకు సైతం వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఏప్రిల్లో మరిన్ని స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు.

హౌసింగ్ డే నేడు

కోటవురట్ల : స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్దనున్న వైఎస్సార్ జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు లేఅవుట్‌ను సందర్శించి సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. సంబంధిత అధికారులు అందరూ హాజరు కావాలని సూచించారు.

దుర్గమ్మ తల్లి దేవాలయం ప్రారంభం



దుర్గమ్మకు పూజలు చేస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : మండలంలోని పెంటకోట బీచ్‌లో దుర్గమ్మ తల్లి దేవాలయాన్ని ఉత్తరాంధ్ర రైతు విభాగం ఇన్‌చార్జ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు శుక్రవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో సప్తగిరి హేచరిస్ అధినేత సత్తిసూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ, ఉపసర్పంచ్ చిక్కాల బాబు, జిల్లా పబ్లిక్ వింగ్ చైర్మన్ దగ్గుపల్లి సాయిబాబా, స్థానిక నాయకులు వంగలపూడి రామారావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, పకుర్తి లోవ, రామాల శ్రీను, దేవవరపు నాగభూషణం, యజ్జల సత్యనారాయణ, పిరాధి రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పంపై ప్రత్యేక దృష్టి



అధికారులతో సమీక్షిస్తున్న డీపీఆర్పీ జిల్లా కో ఆర్డినేటర్ నాగలక్ష్మి

కోటవురట్ల : జగనన్న స్వచ్ఛ సంకల్పంతో గ్రామాల్లో ఆరోగ్యకర వాతావరణానికి కృషి చేయాలని డీపీఆర్పీ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆమె జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. లింగాపురం రెవెన్యూ పరిధిలోని పెద్ద చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇదే మాదిరి మిగతా గ్రామాల్లో కూడా చెరువులను అభివృద్ధి చేసి ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఈవోపీఆర్డీ ప్రేమ్ సాగర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్ఐ అలీ

మునగపాక : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ మహమ్మద్ అలీ సూచించారు. పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా మండలంలోని మూలపేట దళితవాడలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలన్నారు. గ్రామాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యురాలు హైమావతి పాల్గొన్నారు.

ఎయిర్ వాల్వ్ వద్ద చెత్తాచెదారం



ఎయిర్‌వాల్వ్‌లో చెత్తాచెదారం



ఎయిర్‌వాల్వ్ చుట్టూ చేరిన మురుగునీరు

రాంబిల్లి : దిమిలిలో సచివాలయం ఎదురుగా ఉన్న రక్షిత మంచినీటి పథకం ఎయిర్‌వాల్వ్ పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ ఎయిర్‌వాల్వ్ వద్ద చెత్తాచెదారం, తాగిపడేసిన వాటర్ బాటిళ్లు, మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. దీన్ని చుట్టూ మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ నీరు పైప్‌లైన్‌లో కలిసి, కలుషిత నీటి సరఫరాతో అనారోగ్యం బారిన పడుతున్నట్టు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని దిమిలి గ్రామస్తులు కోరుతున్నారు.

మైహోమ్ ఉపకార వేతనాలకు ఎంపిక



మైహోమ్ ఇండస్ట్రీస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో కర్మాగారం ప్రతినిధులు

యలమంచిలి : మైహోమ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ కలిగిన విద్యార్థులను కర్మాగారం ప్రతినిధులు శుక్రవారం ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా కర్మాగారం వైస్ చైర్మన్ వీహెచ్ చౌదరి మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి తమ సంస్థ అందించే స్కాలర్‌షిప్పులు ప్రతిభగల పేద విద్యార్థులకు ఎంతో కొంత ఉపయోగపడితే చాలన్నారు. ఇందుకు రూ.లక్షా 80 వేలు కేటాయించినట్టు తెలిపారు. మండలంలో ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున, 10 స్కూళ్ల నుంచి 30 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. పాఠశాల విద్యకు సహకారంతోపాటు, ఉచిత వైద్య శిబిరాలు, వివిధ సంక్షేమ కార్యక్రమాలను తరచుగా గ్రామాల్లో చేపడుతున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 10 పాఠశాలల హెచ్ఎంలు, సంస్థ సీనియర్ డీజీఎం ఎల్ శ్రీనివాసరావు, సీఎస్‌వో డి.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకాగ్రతతో పోటీ పరీక్షల్లో రాణింపు



ఎన్ఎంఎంఎస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, సిబ్బంది

మునగపాక : విద్యార్థులు పోటీపరీక్షల్లో రాణించాలంటే ఏకాగ్రతతో చదవాలని పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి సూచించారు. మోడల్ స్కూల్ నుంచి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన నలుగురు విద్యార్థుల్ని శుక్రవారం ఆమె అభినందించారు. ఇష్టపడి చదివితే పోటీపరీక్షల్లో రాణించవచ్చన్నారు. పోటీ పరీక్షలకు హాజరవడం ద్వారా విద్యార్థుల్లో భయం పోతుందన్నారు. లక్ష్య సాధనకు చదవడం ద్వారా పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి



మునగపాకలో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

మునగపాక : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు కోరారు. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో ప్రధాని మోడీ ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక చట్టాలు అమలుకావడం లేదన్నారు. అలాగే రైతులకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు చలో ఢిల్లీకి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు పార్వతి, కార్మికులు పద్మ, కుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ధూళి నాగరాజు

రాంబిల్లి : గ్రామాల్లో చేపట్టే సామాజిక తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలని జెడ్పీటీసీ ధూళి నాగరాజు సూచించారు. రాంబిల్లిలో శుక్రవారం సామాజిక తనిఖీపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిష్పక్షపాతంగా తనిఖీలు నిర్వహించి, అవినీతి జరిగితే రికవరీ చేయాలన్నారు. మండలంలో రూ.7 కోట్ల 65 లక్షల 9,644ల విలువైన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు తెలిపారు. గ్రామాల్లో తనిఖీలు పూర్తయిన తర్వాత మండల స్థాయిలో రాంబిల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ జరపనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, వైస్ ఎంపీపీ కె.లక్ష్మీవడ్డికాసులు, ఏపీవో శ్రీనివాస్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మునగపాక : మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఏఈ గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లపై పడిన కొమ్మల తొలగింపుతో పాటు పలు చోట్ల చెట్ల తొలగింపు పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. రైతులు, గృహ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

లక్ష్మీనృసింహుని కల్యాణం నేడు



ఆలయంలో వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి

కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన పురాతన లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవానికి శుక్రవారం రాత్రి అంకురార్పణ జరిగింది. ఏటా చైత్ర శుద్ధ ఏకాదశి రోజున పెద్ద ఎత్తున ఇక్కడ స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ముందు రోజు వేదమంత్రాల నడుమ అంకురార్పణ నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ చేశారు. శనివారం రాత్రి 7 గంటలకు లక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారిని పూలు, పూమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కల్యాణం సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు.

నేడు బుర్రేశ్వరస్వామి కల్యాణం

ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్.రాయవరంలో శ్రీ బుర్రేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని శనివారం జరిపేందుకు ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు పులి సత్తిబాబు శుక్రవారం తెలిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ మేరకు ఆలయం పరిసరాలను ముస్తాబు చేసినట్టు తెలిపారు. భక్తులు పాల్గొని, స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా జేజీబాబు



విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా కోటిపల్లి జేజీ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గవరపాలెం కామాక్షిదేవి ఆలయంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారిగా పొన్నాడ వెంకటసత్య నరసింహాచారి, గౌరవాధ్యక్షులుగా మత్తుర్తి గంగారావు, కోసూరి మన్మథరావు, కాకినాడ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కోటిపల్లి శ్రీనివాసరావు, తణుకు రవికుమార్, ఎస్.సతీష్‌కుమార్, ఎస్.నాగు, మరో 10మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ రెండేళ్ల మనుగడలో ఉంటుందని గోవిందరాజు తెలిపారు.

ఆపద మిత్రలకు అభినందన



ఆపద మిత్ర శిక్షణలో ఉత్తమ ప్రతిభ చూపిన వలంటీర్లను అభినందిస్తున్న ఎంపీడీవో రామచంద్రమూర్తి

ఎస్.రాయవరం : ఆపదమిత్ర శిక్షణలో ఉత్తమ వలంటీర్లుగా ఎంపికయిన మండల వలంటీర్లను ఎంపీడీవో రామచంద్రమూర్తి శుక్రవారం అభినందించారు. ఇటీవల సామర్లకోటలో నిర్వహించిన శిక్షణలో తిమ్మాపురానికి చెందిన చెక్కా అరుణ్‌కుమార్, వాకపాడు గ్రామానికి చెందిన బాలకృష్ణ ప్రతిభ కనబరిచారు. వీరికి ప్రశంసా పత్రాలు అందించి, అభినందించారు.